అక్కడ అలా.. ఇక్కడ మరోలా!

కావడిగుండ్లలో సబ్‌స్టేషన్ నిర్మాణం

- వేగంగా సాగుతున్న పనులు
- వచ్చే ఏడాదిలో అందుబాటులోకి..
- తీరనున్న రైతులు, గృహ వినియోగదారుల అవస్థలు

అశ్వారావుపేటరూరల్: రైతులు, గృహ వినియోగదారులు విద్యుత్ సమస్యలతో ఎన్నో ఏళ్లుగా పడుతున్న అవస్థలు త్వరలోనే దూరం కానున్నాయి. రాష్ట్ర డిప్యూటీ సీఎం చేతుల మీదుగా నియోజకవర్గంలో శంకుస్థాపన చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు కార్యరూపం దాల్చుతున్నాయి. ఈ మేరకు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలు కొద్ది రోజులుగా ఊపందుకున్నాయి.

నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలానికి నాలుగు, దమ్మపేట మండలానికి ఒక విద్యుత్ సబ్ స్టేషన్లను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కృషి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సబ్ స్టేషన్ల నిర్మాణాల టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించగా, నిర్మాణాలు కొద్ది రోజులుగా వేగంగా సాగుతున్నాయి.

ఐదు సబ్ స్టేషన్లు.. రూ.40 కోట్లు

విద్యుత్ సబ్ స్టేషన్లకు ప్రభుత్వం విద్యుత్ శాఖ ద్వారా సుమారు రూ.40 కోట్లు కేటాయించింది. దీంట్లో భాగంగా అశ్వారావుపేట మండలంలోని కావడిగుండ్ల గ్రామంలో కొండరెడ్ల కోసం ప్రత్యేకంగా రూ.2.24 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్, అచ్యుతాపురం గ్రామంలో రూ.3.10 కోట్లతో, తిరుమలకుంట గ్రామంలో రూ.3.15 కోట్లతో, అశ్వారావుపేట-2కు రూ.2.53 కోట్లతో సబ్‌స్టేషన్లు ఖరారు చేశారు. ఆసుపాక గ్రామంలో 400/220కేవీ నిర్మాణానికి రూ.24.46 కోట్లు, దమ్మపేట మండలం పార్కెలగండి గ్రామంలో 33/11కేవీ సబ్ నిర్మాణానికి రూ.2.24 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్లకు ఖర్చు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులు మరికొద్ది నెలల్లో పూర్తి కానున్నాయి. ఆయా సబ్ స్టేషన్లను కొత్త ఏడాది తొలి నెలలో అందుబాటులోకి తెచ్చేలా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.


అచ్యుతాపురంలో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్

తీరనున్న కరెంట్ కష్టాలు..

గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ కేంద్రంలో గృహ అవసరాలు, వ్యవసాయం రంగానికి కొద్ది నెలల్లోనే కరెంట్ కష్టాలు తీరి మరింతా మెరుగైన సేవలు అందనున్నాయి. వీటి నిర్మాణాలతో ముఖ్యంగా కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొని ఉన్న లోవోల్టేజీ సమస్యకు చెక్ పడనున్నది. అలాగే వ్యవసాయ రంగానికి ఈ ప్రాజెక్టు ద్వారా మెరుగైనా విద్యుత్ సరఫరా కానున్నది.

మూడు నెలల్లో అందుబాటులోకి..



ఐదు చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణాలు ప్రారంభం కాగా, నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పనులను మరింత వేగవంతం చేసేందుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. మరో మూడు నెలల్లో నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకొగా, వచ్చే కొత్త ఏడాదిలో అందుబాటులోకి వస్తాయి.

– వెంకటరత్నం, ఏడీఈ, అశ్వారావుపేట

ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్

- ఆపరేటర్ల లేమితో వెనుకబాటు
- ఆరు నెలలుగా మూలకుపడిన ప్రాజెక్ట్

పినపాక: పినపాక మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో రూ.1.80 కోట్లు వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తయ్యి దాదాపు ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. ఫలితంగా, ప్రజాధనం వృథా అవుతుండటంతో పాటు.. మెరుగైన విద్యుత్ కోసం ఎదురుచూస్తున్న స్థానిక ప్రజలు తీవ్ర నిరాశలో మునిగిపోయారు.

మూడు సంవత్సరాల క్రితమే పునాది..

మూడు సంవత్సరాల క్రితం ఈ సబ్‌స్టేషన్ పనులు అప్పటి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు చేతులమీదుగా ప్రారంభమయ్యాయి. విద్యుత్ లోపం తీవ్రంగా ఉన్న వెంకట్రావుపేట, చింతల బయ్యారం, జగ్గారం ప్రాంతాలకు దీని ద్వారా స్థిరమైన విద్యుత్ సరఫరా అందుతుందని ప్రజల్లో అంచనాలు ఏర్పడ్డాయి. భారీ వ్యయంతో నిర్మాణం పూర్తయి 2025 మార్చి నెలలో సిద్ధమైనా, ఇప్పటివరకు ప్రారంభం కాని పరిస్థితి స్థానికంగా విమర్శలకు దారితీస్తోంది.

నియామకాలు చేపట్టకపోవడంతో..

వెంకట్రావుపేట సబ్‌స్టేషన్ భవనం,యంత్ర సామగ్రి ఏర్పాటు, టెస్టింగ్‌లు అన్నీ పూర్తయ్యాయి. సాంకేతికంగా ఇది ఎప్పుడైనా విద్యుత్ సరఫరాకు సిద్ధంగా ఉంది. అయితే ఈ కేంద్రాన్ని ఆపరేట్ చేయడానికి అవసరమైన ఆపరేటర్ల సిబ్బంది కొరత కారణంగా పంపిణీ సంస్థ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తూ వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతున్నా.. ఈ కీలకమైన ప్రాజెక్టుకు సంబంధించిన నియామకాలను పూర్తి చేయలేకపోవడంపై ప్రతిపక్షాలు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి త్వరగా సిబ్బందిని నియమించి సబ్‌స్టేషన్ ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ప్రారంభం కాని వెంకట్రావుపేట సబ్‌స్టేషన్ ఇదే..

నియామకాలు పూర్తవగానే ప్రారంభిస్తాం..



నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ భవనం అన్ని యంత్ర సామగ్రి పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి. సాంకేతికంగా ఎలాంటి లోపాలు లేవు. మాకు ఉన్న ఏకైక అడ్డంకి ఈ కేంద్రాన్ని 24 గంటలు ఆపరేట్ చేయడానికి అవసరమైన శిక్షణ పొందిన ఆపరేటర్ల సిబ్బంది కొరత. ప్రస్తుతం నియామక ప్రక్రియ తుది దశలో ఉంది. నియామకాలు పూర్తయిన తక్షణమే సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకువస్తాం.

– జీవన్ కుమార్, డీఈ, భద్రాచలం

క్లుప్తంగా

రామయ్యకు పునర్వసు కల్యాణం


కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు పవిత్ర గోదావరి నదీ జలాలను తీర్థ బిందెలో తీసుకొచ్చి సీతాలక్ష్మణ సమేత రామచంద్ర స్వామి వారికి పంచామృతాభిషేకం, తిరుమంజనం చేశారు. అనంతరం పునర్వసు నక్షత్ర కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, మాంగల్య ధారణ, తలంబ్రాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ముఖ్య అర్చకులు భార్గవాచార్యులు, కోటి విష్ణువర్ధనాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులు స్థానిక రైతులకు వర్మీకంపోస్టు తయారీ, వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థుల బృందం గ్రామంలో పర్యటించింది. అనంతరం ఉద్యాన పంటల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నుంచి ఎరువులను తయారీ చేసే విధానం, పంటకు కలిగే లాభాలు గురించి రైతులకు వివరించారు. ఉద్యాన కళాశాల విద్యార్థుల కృష్ణ నాయక్, నగేష్, వంశీ, సురేంద్ర, ధర్మతేజ, పంచాయతీ కార్యదర్శి రమేష్, రైతులు పాల్గొన్నారు.

కాలనీని సందర్శించిన కమిషనర్

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీని మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు మంగళవారం సందర్శించారు. కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, పల్లెదవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కాలనీలో వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తామని కాలనీవాసులకు చెప్పారు. తడిచెత్తను, పొడిచెత్తను వేర్వేరుగా వాహనాలకు అందించాలని సూచించారు. ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ డీఈ నందయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పార్కలగండి గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు వినియోగించాల్సిన ఆవశ్యకతను గూర్చి వివరించారు. విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం, ఏఈ సాయికిరణ్, సబ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, పైడి వెంకటేశ్వరరావు, అచ్యుతరావు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


జేసీబీతో కొనసాగుతున్న పనులు..

దమ్మపేట: మండలంలోని జమేదారుబంజర నుండి గండుగులపల్లి గ్రామానికి వెళ్లు మార్గ మధ్యలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుతో పాటుగా అప్రోచ్ రోడ్డు కోట్టుకుపోయి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డుకు మరమ్మతు నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, అధికారులకు గ్రామస్తులు గత కొద్దిరోజుల కిందట విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు జేసీబీ యంత్రం సహాయంతో మట్టిని నింపి, గుంతలను పూడ్చారు.

వ్యాయామంతో ఒత్తిడి దూరం

చర్ల: శారీరక వ్యాయామంతో మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చని, ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సత్యనారాయణపురం సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ పేర్కొన్నారు. ఈఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమాండెంట్ మాట్లాడారు. వ్యాయామంతో మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ రాజేష్ డోగ్రా, ఇన్‌స్పెక్టర్లు నరేంద్ర కుమార్ యాదవ్, కృష్ణ కుమార్ సింగ్ జవాన్లు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీ

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని పెట్రోల్ బంకుల్లో తూనికలు, కొలతల అధికారి మనోహర్ మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌పీ పెట్రోల్ బంకులో ఉన్న అన్ని పంపుల నుంచి డీజిల్, పెట్రోల్ లను రీడింగ్ ప్రకారం కొలతలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంకుల్లో వినియోగదారులకు కొలతల ప్రకారమే డీజిల్, పెట్రోల్ పోస్తున్నారని వివరించారు. అపోహలు వీడాలని సూచించారు.


హెచ్‌పీ బంకులో కొలతను పరిశీలిస్తున్న అధికారి మనోహర్

ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి


డీవైసీఎంఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నేతలు

మణుగూరుటౌన్: సింగరేణి ఆస్పత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేక కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే స్పెషలిస్ట్ వైద్యులను నియమించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డివైసీఎంఓ జ్యోతిర్మయికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ.. గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్యులు లేక గర్భిణులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైద్య నిపుణుల కోసం 70 కిలో మీటర్లు ప్రయాణం చేయడం వల్ల గర్భంలోని శిశువును కోల్పోవడం బాధాకరమన్నారు. ఆస్పత్రిలో సరైన వసతులు, సరైన మందులు కూడా లేవని, కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడితే గుర్తింపు సంఘంగా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వై.రామనర్సయ్య, మేకల ఈశ్వర్‌రావు, దాట్ల సందీప్, శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాశ్‌చారి, రవికుమార్, శ్రీనివాసరావు, రవి, రత్నం శివకుమార్, రామారావు, దండు విజయ్‌కుమార్, నరహరి, రవిశంకర్, కార్తీక్, మంద కోటేశ్వరరావు, సుధాకర్, రెడ్డి, సురేశ్, త్రినాథ్ తదితరులు ఉన్నారు.

బాణసంచా దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు మున్సిపాలిటీ కార్యాయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ బి.నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈనెల 15 నుంచి 17 సాయంత్రం 4గంటల వరకు కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు 2025–26 ఇంటిపన్ను రశీదు, నల్లాపన్ను రశీదు, ఆధార్, పాన్‌కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్, దుకాణ ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు 2, నక్ష కాపీలు 3 దరఖాస్తుతోపాటు జతచేయాలని సూచించారు. దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు జరుగకుండా ముందుజాగ్రత్తగా రెండు డ్రమ్ముల నీళ్లు, రెండు బకెట్ల ఇసుక ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మందుగుండు సామగ్రి మొత్తం నిర్దేశించిన దుకాణంలోనే భద్రపరచాలి కానీ జనావాసాల మధ్య, గోదాముల్లో నిల్వ చేయొద్దని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే షాపు యజమాని నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. యజమాని నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. 120 మైక్రాన్ కన్నా తక్కువ నాణ్యత ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను ఉపయోగిస్తే రూ.100 నుంచి రూ.5వేలు వరకు జరిమానా, దుకాణం అనుమతి రద్దు చేస్తామని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ప్రాంగణాన్ని శుభ్రం చేసి అప్పగించాలని, లేదంటే రూ.2000 జరిమానా విధించి వారిచేతే శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు. రేకుల షెడ్డు ఉన్న షాపులకే అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

16న అఖిలపక్షం సమావేశం

దుమ్ముగూడెం: భద్రాచలం– చర్ల ప్రధాన రహదారి సమస్యపై అక్టోబర్ 16న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ములకపాడు వైయస్ భవన్‌లో చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక లారీల వల్ల భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు వంద కిలోమీటర్లు ప్రధాన రహదారి ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీన భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలతో కలిపి నియోజక వర్గ స్థాయిలో భద్రాచలంలో అఖిలపక్ష పార్టీలు, ఆదివాసీ, దళిత, సామాజిక, ప్రజా సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఈ అఖిలపక్ష సమావేశంలో భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామని ప్రకటించారు. సమావేశంలో నాయకులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య, యలమంచి వంశీకృష్ణ, బందారు శరత్, కొర్సా చిలకమ్మ పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీలో గల గోవిందాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార మాసోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుంజ సుశీల మాట్లాడుతూ.. స్థానికంగా లభించే తాజా కూరగాయలు, పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయి అన్నారు. ముఖ్యంగా మహిళలలో రక్తహీనత రాకుండా బలమైన పోషక ఆహారాన్ని, జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మహిళలకు పోషకాహారంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భారతి, నాగమణి, పార్వతి, విజయకుమారి, గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.


తాజా కాయగూరలతో లాభాలను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ప్రమాదవశాత్తు తెగిన చిన్నారి వేలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణానికి సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎటపాకకు చెందిన 6 ఏళ్ల అనుష వేలు ప్రమాదవశాత్తు కట్ అయింది. కత్తిపీటతో జామకాయ కోస్తుండగా ఎముకతో సహా చేతి వేలు తెగిపోయింది. తండ్రి కోటేష్ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా.. వైద్యుడు దేవరాజు వేలికి శస్త్ర చికిత్స చేసి క్లిప్పు వేశారు. బుధవారం మరోసారి చిన్నారిని పరిశీలించి ఇంకో శస్త్రచికిత్స చేయనున్నట్లుగా ఏరియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

సంతాపం..

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామపంచాయతీలో బండ్ల గోపయ్య కుమారుడు బండ్ల శేఖర్ మరణించగా.. బీఆర్ఎస్ నాయకులు మంగళవారం శేఖర్ భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, వేర్పుల సురేష్, అక్కి నర్సింహారావు, ఉప్పుతల రామారావు, దామల్ల దయాకర్,కుంజా పరమయ్య, పూనెం రాము, కుంజా శేషమ్మ, గార విష్ణు, సురేందర్ ఉన్నారు.

18న బీసీ జేఏసీ బంద్

అశ్వారావుపేట: బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణమండపంలో నాయకులు మంగళవారం సమావేశమై ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టు తీర్పుకు నిరసనగా బంద్‌లో పార్టీలకతీతంగా బీసీ నాయకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకుల కురిశెట్టి నాగబాబు నాయుడు, ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు, షేక్ పకీర్, చిన్నంశెట్టి సత్యనారాయణ, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, తాళం సూరిబాబు, అంకోలు వెంకటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సభ..

ములకలపల్లి: గ్రామపంచాయతీ కార్మికుల జిల్లా 4వ మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు చిక్కుల శ్రీను పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ నెల 18న ములకలపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సభకు, జీపీ వర్కర్లు భారీగా హాజరుకావాలని కోరారు. సంఘ మండల కార్యదర్శి గంటి శ్రీను, కోశాధికారి వర్కా రుక్మాంగధర రావు, మేకల రమేశ్, పసుపులేటి రామారావు, కమ్మంపాటి నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వినతి

దుమ్ముగూడెం: గిరిజనుల ఆస్తి హక్కులను రక్షించాలని, తమ భూములకు పట్టాలు ఇవ్వాలని కలెక్టరేట్‌లో మంగళవారం మండలంలోని దబ్బనూతులా గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం పేరుతో ఎన్నో సంవత్సరాలుగా దబ్బనూతులా గ్రామ గిరిజనులు సాగు చేస్తున్న భూములను రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే భూ సేకరణ నిలిపివేయాలని వినతిలో కోరారు. కార్యక్రమంలో సొందే తిరపతి, సొందే నరసింహారావు, కుర్సం లింగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుంగను ‘కవర్’ చేశారు..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక నుంచి గుంటిమడుగు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో మూల మలుపు సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద ఇటివలె కురిసిన భారీ వర్షాలతో బుంగ పడింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వారు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గుంతలో కర్ర పెట్టి దానికి హెచ్చరికగా ఖాళీ కవర్‌ను కట్టారు. ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రహదారిపై పడిన బుంగ వద్ద హెచ్చరికగా పెట్టిన ఖాళీ కవర్

సీపీఆర్‌పై అవగాహన సదస్సు


సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు శివకుమార్

అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అశ్వాపురం జూనియర్ కాలేజీ, అశ్వాపురం హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సదస్సులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలు గుండె జబ్బుల ద్వారానే అవుతున్నాయని తెలిపారు. అత్యవసర సమయంలో తోటి వారికి కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు సీపీఆర్ చేసి, అంబులెన్స్ ద్వారా దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు నిలబెట్టొచ్చన్నారు. విద్యార్థుల చేత సీపీఆర్ ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ ,రాజేష్, ఏఎన్ఎంలు తిరుపతమ్మ, శైలజ, ఆశాలు, హైస్కూల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘కార్మికుల కడుపుకొడతారా?’


భద్రాచలంఅర్బన్: సమ్మెలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: లక్షల్లో వేతనాలు తీసుకుంటున్న ప్రజాప్రతినిధులు.. వసతిగృహాల కార్మికుల వేతనాలు తగ్గించి వారి కడుపుకొడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ ఎదుట హాస్టల్ వర్కర్ల 72 గంటల నిరవధిక దీక్ష కొనసాగుతుండగా.. రెండో రోజు మంగళవారం పలువురు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. జేఏసీ జిల్లా కన్వీనర్ బ్రహ్మాచారి, నాగేశ్వరరావులు సభకు అధ్యక్షతన వహించగా.. సభను ఉద్దేశించి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్మికులు అన్నపానాలు ఐటీడీఏ గేటు వద్దే స్వీకరిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ.. గిరిజన కార్మికులకు జీతాలు తగ్గించడం చాలా అన్యాయమని ఆయన విమర్శించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ , ఆదివాసీ సంఘాల నాయకులు పూణెం కృష్ణ, రవివర్మలు మాట్లాడుతూ.. సమ్మె డిమాండ్లు పరిష్కరించకపోతే మంత్రులు ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆకలితో విద్యార్థులు..

మణుగూరురూరల్: గిరిజన వసతి గృహాల్లో పని చేస్తున్న డైలీ వేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాస్ అఖిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండలంలో వర్కర్లు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ.. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. వర్కర్లు సమ్మెలో ఉండడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారని, వర్కర్ల సమస్యను పరిష్కరించాలని అన్నారు. రాము, ప్రేమ్, కిరణ్, మోహన్‌సాయి, తరుణ్, చరణ్, కౌశిక్, రోహిత్, తేజ, హరీష్, లక్ష్మీనర్సింహ, జ్యోతిష్, అనురూప్ పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా చెట్ల పొదలు

అశ్వాపురం: మండల పరిధిలోని వెంకటాపురం నుండి మారుమూల గిరిజన గ్రామమైన మామిళ్ళవాయి గ్రామం వరకు రహదారికి ఇరువైపుల చెట్ల పొదలు ఉండి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిళ్ళవాయి వరకు 4.5 కిలోమీటర్లు ఎన్నో ఏండ్లుగా కనీస రహదారి సౌకర్యం లేదు. రహదారి గుంతలుగా, అస్తవ్యస్తంగా ఉండి. ఉన్న ఆ రహదారి వెంబడి సైతం రెండు పక్కలా చెట్లపొదలు అడవిని తలపిస్తున్నాయి. రహదారి పై ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడడం లేదు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లపొదలను తొలగించాలని కోరుతున్నారు.


మామిళ్లవాయి రహదారిని కమ్మేసిన చెట్ల పొదలు